నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, బుధవారం 31 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET


## ఆధార్ తప్పుగా నమోదు చేశారు



మెరెడ్డి రామకృష్ణారెడ్డి

మూసాపేట, జూలై 30 : నా పేరు మెరెడ్డి రామృకృష్ణారెడ్డి తండ్రి నారాయణరెడ్డి మాది సంకలమద్ది గ్రామం, మూసాపేట మండలం. నాకు సంకలమద్ది శివారులో 4 ఎకరాల 36 గుంటల భూమి ఉంది. నేను గతంలో పంట పెట్టుబడి కోసం మూసాపేట ఏపీజీవీబీలో అప్పు తీసుకున్నాను. ఆ అప్పు తేది ముగుస్తుందని బ్యాంకు వారు చెప్పితే ఈ నెల 2వ తేదీన రూ.99,732 అయితే అప్పును మళ్లీ రెన్యూవల్ చేసుకున్నాను. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలన్నీ మాఫీ చేసినట్లు ప్రకటించడంతో బ్యాంకుకు వెళ్లి అడిగాను. నీకు 2వ విడుతలో వస్తుందని చెప్పారు. మంగళవారం మళ్లీ బ్యాంక్ వద్దకు వచ్చినా అప్పు మాఫీ అయ్యిందా అని అడిగితే కాలేదని బ్యాంకు అధికారులు చెప్పారు. ఎందుకు కాలేదని అడిగితే మాకు తెలియదు వ్యవసాయాధికారులను అడగాలని చెప్పడంతో అక్కడివెళ్లి వారిని అడిగాను. వారేమో నా ఆధార్ కార్డు నెంబర్ నమోదు చేసి చూస్తే అసలు నీ పేరుపై అప్పు ఉన్నట్లే చూపడం లేదని చెప్పడంతో మళ్లీ బ్యాంకుకు వెళ్లి అడిగితే నీ ఆధార్ కార్డు నెంబర్ మరో వ్యక్తి మెరెడ్డి రామకృష్ణారెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి తీసుకున్న అప్పునకు లింకు అయ్యి ఉందని చెప్తున్నారు. అతను మా దాయాది అతను ఇటీవల మరణించాడు. అతని పేరుపై ఉన్న అప్పు కూడా వారి కుమారుడు చెల్లించినట్లు చెప్పారు. కానీ బ్యాంకులో నా ఆధార్ కార్డు నెంబర్‌ను మరో వ్యక్తికి లింకు చేసి, మళ్లీ నాకు అప్పు కూడా ఇచ్చారు. అప్పుడు ఇవ్వడానికి వచ్చింది. కానీ రుణమాఫీకి ఎందుకు వర్తించదని అడిగితే పై అధికారులకు పంపుతామని చెప్పి తప్పించుకుంటున్నారు. నాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నాకు రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ రైతు 'నమస్తే తెలంగాణ' ద్వారా అధికారులను కోరుతున్నాడు.

## ప్రాణం పోయాక భాగ పరిష్కారం

- ఆలూరు రైతు ఆత్మహత్య ఘటనలో తీరు ఇదీ..
- ఆనంద్‌ను ఇబ్బంది పెట్టిన చిన్నాన్న?
- ఒప్పందం కుదిరాకే మృతదేహం ఖననం
- మనుషుల్లో కనుమరుగైన మానవత్వం



ఆనంద్(ఫైల్)

గట్టు, జూలై 30 : మనుషుల్లో మానవత్వం కరువైందనడానికి ఆలూరులో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. ఇరువురికి చెందాల్సిన భూమిని ఒక్కడే అనుభవిస్తూ.. తోడబుట్టిన అన్న కుమారుడికే ఆస్తిని పంచి ఇవ్వక అతడి ఆత్మహత్యకు కారకుడయ్యాడు ఆ చిన్నాన్న. భాగపరిష్కారం అయ్యేవరకు మృతదేహాన్ని ఖననం చేయమని అందరూ తేల్చిచెప్పడంతో అప్పుడు మనసు కరిగింది. దీంతో మృతదేహం ఖననం జరిగి కథ అక్కడితో సుఖాంతమైంది. ఈ హృదయ విదారక ఘటన వివరాలు ఇవీ. ఆలూరులో తమ పెద్దల నుంచి కుమ్మరి గోవిందుకు 4 ఎకరాల పొలం వచ్చింది. ఇది అతనితోపాటు అతని అన్న పెద్ద రంగన్న కుమారుడు ఆనంద్‌కు చెందాలని పెద్దలు నిర్ణయించారు. ఈ పొలంతోపాటు కుమ్మరి నాగమ్మకు చెందిన 1.22 గుంటల భూమి కూడా ఇద్దరికీ చెందాలని ఒప్పందం. కాగా తనకు రావాల్సిన వాటా పొలాన్ని తన పేర రిజిస్ట్రేషన్ చేయించాలని ఏండ్లుగా ఆనంద్ తన చిన్నాన్నను అడుగుతూ వచ్చాడు. అయితే ఎప్పటికప్పుడూ ఆయన దాన్ని వాయిదా వేశాడు.

ఈ క్రమంలో పొలం తనకు రాదని మనస్తాపం చెంది ఆనంద్ పురుగుల మందు తాగాడు. కాగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆనంద్‌కు భార్య ఉన్నది. కాగా, చాలా కాలం తరువాత ఆనంద్‌కు ఇటీవల కవల పిల్లలు జన్మించారు. చిన్న వయస్సులోనే ఆస్తి తగాదాల కారణంగా భార్యాపిల్లలకు దూరం కావడం అందరినీ కలిచివేస్తోంది. ఆలూరులో ఈ ఘటన గురించే మంగళవారం చర్చ కొనసాగింది. కాగా భాగపరిష్కా రం పూర్తయ్యేదాకా మృతదేహాన్ని ఖననం చేయమని చెబుతూ ఆనంద్ కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు తాసీల్దార్ కార్యాలయానికి మంగళవారం వచ్చారు. తాసీల్దార్‌తో మాట్లాడామని, భాగపరిష్కారానికి ఆమె హామీ ఇచ్చినట్లు ఆనంద్ కుటుంబసభ్యులు, గ్రామస్తులు చెప్పారు. ఈ ఘటనపై తాసీల్దార్ సరితారాణిని ఫోన్‌లో వివరణ కోరగా తనకు తెలియదన్నారు. రైతులెవరూ తన వద్దకు రాలేదని చెప్పారు. ఫోన్‌లో వివరాలు అడిగితే ఎలా? కార్యాలయానికి వచ్చే వివరాలు తెలుసుకోవాలంటూ ముక్తసరిగా ముగించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

## చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- జడ్చర్లలో జరిగిన ఘటనలో రూ.30లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పాలమూరు ఎస్పీ జానకి

జడ్చర్ల, జూలై 30 : ఈనెల 16న హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో జరిగిన దొంతనం కేసులోని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకి తెలిపారు. మంగళవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ (మోతినగర్) విద్యుత్‌శాఖలో పనిచేసే దామోదర్ తన అక్క భాగ్యలక్ష్మికి అవసరం నిమిత్తం తన వద్ద ఉన్న రూ.36 లక్షలు తీసుకొని ఈనెల 16న కర్నూల్ వెళ్లేందుకు ఎంజీబీఎస్ బస్టాండ్ (హైదరాబాద్) నుంచి కర్నూల్ వెళ్లే పికెట్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. ఈ క్రమంలో తన దగ్గర ఉన్న రూ.36లక్షల నగదు కలిగిన బ్యాగ్‌ను తన సీటు పైభాగంలో ఉన్న క్యాబిన్‌పై పెట్టి దానికింద సీటులో కూర్చున్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ర్టానికి చెందిన ఎండీ షారుక్, అబ్దుల్ సత్తార్, షేక్ దిల్షాన్ అహ్మద్ డబ్బులు ఉన్న బ్యాగును గమనించిన వారు బాధితుడిని ఏమార్చి అతడి బ్యాగులో ఉన్న రూ.36 లక్షల నగదును మరో బ్యాగులోకి మార్చారు. బాధితుని బ్యాగులో నీళ్ల బాటిళ్లు పెట్టారు. ఈ క్రమంలో బస్సు జడ్చర్ల ఫ్లైవర్ దగ్గరకు రాగానే ఎండీ షారుక్, షేక్ దిల్షాన్‌అహ్మద్ బస్సులో నుంచి డబ్బుల బ్యాగుతో దిగి పోగా, మరో నిందితుడు అబ్దుల్ సత్తార్ జడ్చర్ల కొత్తబస్టాండ్‌లో బస్సు దిగి వెళ్లిపోయాడని తెలిపారు. జడ్చర్ల కొత్తబస్టాండ్‌లో బస్సు ఆగిన తర్వాత బాధితుడు దామోదర్ టిఫిన్ చేయడానికని క్యాబిన్‌పై ఉన్న డబ్బుల బ్యాగును తీసుకోగా బ్యాగు బరువు తక్కువ అనిపించడంతో అనుమానం వచ్చి బ్యాగును తెరిచి చూడగా బ్యాగులో డబ్బులు కనిపించలేదు. అందులో వాటర్‌బాటిల్ ఉండడం చూసి బాధితుడు సమీపంలోని జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన జడ్చర్ల పోలీసులు దర్యాప్తును వేగవంతంగా చేపట్టారు. జడ్చర్ల– హైదరాబాద్‌లోని సీసీ పుటేజీల ఆధారంగా ఈ నెల 28వ తేదీన నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బిజునూరులో ఉన్నట్లు తెలుసుకొని అక్కడకు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30లక్షల నగదు స్వాధీనం చేసుకొని బిజునూరు సీజేఎం కోర్టులో నిందితులను హాజరుపరిచి ఆ తర్వాత ట్రాన్సిట్ వారెంట్ మేరకు ఇద్దరు నిందితులైన షారుక్, దిల్షాన్‌లను అరెస్టు చేసి జడ్చర్ల కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. మరో నిందితుడు అబ్దుల్ సత్తార్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. అతడిని కూడా త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. చోరీ కేసును త్వరగా ఛేదించిన జడ్చర్ల పోలీసులను ఎస్పీ అభినందించి వారికి రివార్డులను అందజేశారు. సమావేశంలో జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్సై శివానందం తదితరులు ఉన్నారు.

## అదనపు కలెక్టర్ అవాక్కు

మహ్మదాబాద్ మండలకేంద్రం నుంచి చిన్నాయిపల్లి, మఠంలపల్లి, బండమీదిపల్లి వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల రహదారి బురదమయంగా మారింది. వర్షాలతో నడిచేందుకు కూడా ఇబ్బందిగా మారడంతో తండా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా గ్రామంలోనే ఉంటున్నారు. కనీసం నడవాలన్నా ఎక్కడ కింద పడిపోతామో అన్న పరిస్థితి ఉందని, దీంతో పిల్లలను స్కూల్‌కు పంపడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అయితే, ఈ తండాల్లో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వచ్చిన అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఈ రహదారిని చూసి అవాక్కయ్యారు. ప్రజలు ఇంత అవస్థలు పడుతున్నా అధికారులు ఎందుకు మరమ్మతులు చేయడం లేదని నిలదీశారు. జిల్లాలో రహదారుల దుస్థితి వల్ల విద్యార్థుల చదువులపై కూడా ప్రభావం చూపే పరిస్థితి ఉంది.



ఇటీవల బండమీది పల్లెకు వెళ్లే మట్టి రోడ్డును పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



గుంతలమయంగా మారిన మూసాపేట బీటీ రోడ్డు

# ఎంత దారిద్ర్యమో!

## రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- సీఎం సొంత జిల్లాలో అధ్వానంగా రహదారులు
- గ్రామీణ, పట్టణ, జిల్లా సడక్‌లు గుంతలమయం
- మున్సిపాలిటీల్లో మెయింటెనెన్స్ అంతంతే..
- కాంగ్రెస్ ప్రభుత్వంలో మరమ్మతులు కరువు
- నిధులు లేవంటున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

మహబూబ్‌నగర్, జూలై 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసలే సీఎం సొంత జిల్లా.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులు కాల్వలయ్యాయి.. ఎక్కడపడితే అక్కడ గుంతలు పడి వాహనాలకే కాదు నడవడానికి కూడా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది.. సాయంత్రం కాగానే ఊళ్లకు చేరుకునే దుస్థితి.. అయితే మాకేంటి.. సర్కారు చిల్లి గవ్వ ఇవ్వకుంటే మరమ్మతులు మెమెలా చేయాలి? అని అధికారులు చేతులెత్తేశారు.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా కేంద్రాల్లో కూడా రహదారులన్నీ దెబ్బతిన్నాయి.. మున్సిపాలిటీలోనూ ఇదే పరిస్థితి.. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల గురించి చెప్పనవసరం లేదు.. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల నుంచి రోజు పట్టణాలకు వచ్చి పనులు చేసుకునే కూలీలు, కూరగాయల అమ్మే రైతుల వరకు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు.. సీఎం సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జనం పడుతున్న అవస్థలపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పట్టణం, పల్లె అనే తేడాల్లేకుండా రహదారులన్నీ పాడైపోయాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కారు గడిచిన 8 నెలలుగా గ్రామీణ, పట్టణ రహదారులకు చిల్లి గవ్వ కూడా ఇవ్వకపోవడంతో మరమ్మతులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. జిల్లా కేంద్రాల్లో అయితే రహదారులన్నీ గుంతలమయం కావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇటీవల రహదారిపై వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. కోయిలకొండ మండలంలోని అనేక తండాలకు రహదారులు లేకపోవడంతో తండావాసుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఇటీవల కొందరు రహదారులపై సర్కస్ ఫీట్లు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రహదారులన్నీ దెబ్బతినడంతో గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే మరమ్మతులకు నయా పైసా లేదని చేతులు ఎత్తేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలకు రూ.వందల కోట్లు కేటాయించేది. కానీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి పూర్తిగా మంగళం పాడింది. ఈ నిధులన్నీ ఇతర అవసరాలకు డైవర్ట్ చేసింది. ఫలితంగా కొత్త రహదారులు వేయకపోగా ఉన్న రహదారుల మరమ్మతులను మరిచిపోయారు. సీఎం సొంత జిల్లాలోనే ఈ పరిస్థితి ఉంటే రాష్ట్రం అంతటా ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించుకోవచ్చు.

### మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రెండు ప్రధాన రహదారులు తప్పితే మిగతా రహదారులన్నీ పరీక్షగా మారాయి. క్లాక్‌టవర్ నుంచి టీడీగుట్ట హన్వాడకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. తెలంగాణ చౌరస్తా నుంచి కోర్టు మీదుగా కలెక్టర్ బంగ్లా చౌరస్తా వరకు రోడ్డుపై వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. నిత్యం కలెక్టర్ ఎస్పీలతోపాటు జడ్జీలు ఇతర న్యాయవాదులు తిరిగే ప్రధాన రహదారి అయినా పట్టించుకునే వారే లేరు. అశోక్ టాకీస్ చౌరస్తా నుంచి క్లాక్ టవర్ వరకు మున్సిపాలిటీ ఎదురుగానే రహదారి గుంతల మయంగా మారిన ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎర్రసత్యం చౌరస్తా నుంచి బోయపల్లి గేటు వరకు కూడా రహదారి పూర్తిగా గుంతలమయం అయింది.

### ధ్వంసమైన జాతీయ రహదారి..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి రాయిచూరు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. పాలమూరు యూనివర్సిటీ నుంచి దేవరకద్ర వరకు రహదారి ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోయిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూ ఉన్నాయి. అక్కడక్కడ ప్యాచులు వేసినా ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాడైపోయింది. జాతీయ రహదారుల శాఖ కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఈ రహదారి విస్తరణ సమయంలో నాసిరకం పనులు చేశారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అయినా పట్టించుకోకుండా రోడ్డు వేయడంతో అవి ఇప్పుడు నిజమయ్యాయి. తెలంగాణ–కర్ణాటకను కలిపే హైవే ఇదే కావడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు.

### కాల్వ అనుకుంటే పొరపాటే..

ఇదేదో కాల్వ అనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఇది ఓ తండాకు వెళ్లే రహదారి అంటే ఆశ్చర్యం వేయక మానదు.. ఇది ఎక్కడో కాదు సీఎం సొంత జిల్లాలో ఓ తండా రహదారి పరిస్థితి.. వర్షం వచ్చిందంటే చాలు రహదారి ఇలా కాల్వగా మారిపోతుంది. గతంలో రహదారి లేని తండాకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రోడ్డు వేశారు.. అయితే ఎనిమిది నెలలుగా దీనికి మరమ్మతులు చేయకపోవడంతో ఈ రహదారి అధ్వానంగా మారిపోయింది. మహబూబ్‌నగర్ రూరల్ మండలం జైనల్లీపూర్ నుంచి లాల్యానాయక్ తండాకు వెళ్లే రెండు కిలో మీటర్ల రహదారి ఇది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏకంగా కాల్వగా మారిపోయింది. గతంలో తండాకు రహదారి లేకపోతే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఏకంగా కొత్త రోడ్డును నిర్మించింది. జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగుతున్నాయి. అయితే ఈ రహదారి గురించి పట్టించుకోకపోవడంతో ఇలా తయారైంది. తండా నుంచి జిల్లా కేంద్రానికి రావాలన్నా తిరిగి వెళ్లాలన్నా జనం అవస్థలు పడుతున్నారు. పొలం గట్ల వెంట తండాకు చేరుకుంటున్నారు. రాత్రిళ్లు ప్రయాణించాలంటే భయంతో వణికిపోతున్నారు.



### పట్టించుకోని మంత్రి, ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి ఎనిమిది నెలలు అవుతున్నా ఉమ్మడి జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు రహదారుల మరమ్మతులను పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏకైక మంత్రి జూపల్లి కృష్ణారావు తన సొంత నియోజకవర్గంలోని రహదారులు పాడైనా పట్టించుకున్న పాపాన పోలేదు. మిగతా ఎమ్మెల్యేలు కూడా వారి నియోజకవర్గాల్లో అస్తవ్యస్తంగా మారిన రోడ్లను పట్టించుకోవడమే లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు 6 గ్యారెంటీలు అమలు చేయకపోవడం.. రైతు భరోసా, రుణమాఫీ అర్హులకు ఇవ్వకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరుగలేక పోతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పర్యటించి హడావిడి చేశారే తప్పా.. రోడ్ల కోసం నయా పైసా విదిల్చలేదు.

## కాల్వలకు నీళ్లిచ్చి చెరువులను నింపాలి

- కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన పనులను వెంటనే ప్రారంభించాలి
- జిల్లా కేంద్రం అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలి
- కలెక్టర్‌ను కలిసి వివరించిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 30 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గంలో అర్ధాంతరంగా నిలిచిన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని, కాల్వలకు నీళ్లివ్వడంతోపాటు చెరువులను నింపాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన అనేక పనులను కొనసాగించాలన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన సాగునీటి పనులను ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగించాలని, ఖిల్లాఘణపురం, బుద్ధారం చెరువులను ప్రత్యేక జీవో ద్వారా 3500 ఎకరాల నుంచి 5 వేల ఎకరాల ఆయకట్టుకు ఉపయోగపడే విధంగా ప్రతిపాదనలు చేసి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వంలో కొన్ని మార్పులు చేస్తూ పనులు కొనసాగిస్తున్నారని, దీనివల్ల వేలాది మంది రైతులు నష్టపోతారన్నారు. ఇందుకోసం యథావిధిగా పనులు కొనసాగిస్తే రైతులకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. మామిడిమాడ రిజర్వాయర్ పూర్తి చేయాలని, కర్నేతండా కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతిపాదించిన విధంగా పనులు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే రూ.50 కోట్లతో చేపట్టే రామన్నగుట్ట రిజర్వాయర్(డీ8.. ఎంజే 4) కాశీంనగర్, రేమొద్దుల, అంజనగిరి పరిధిలో పనులకు టెండర్ పిలవాలని కోరారు. బుద్రవాగు చెక్‌డ్యాంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాలని, నాగవరం, రాజనగరం పరిధిలోని భూములపై దేవాదాయశాఖ నిషేధిత జీవో ఎత్తివేయాలని కోరారు. సవాయిగూడెం, నాచనహళ్లి మధ్యలో ఉన్న జమ్ములతండాకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని, కేఎల్ఐ కెనాల్స్ ద్వారా నీటిని విడుదల చేసేందుకు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కోసం మొదటి విడుతలో 5 కోట్లు, రెండో విడుతలో రూ.32 కోట్లు మంజూరై ఉన్నాయని, వీటి పనులను వెంటనే చేపట్టాలన్నారు. బైపాస్ రోడ్డు పనులు, అగ్రికల్చర్ కాలేజీ, వనపర్తి పెబ్బేరు మధ్య 9 కిలోమీటర్ల రోడ్డు, పాలిటెక్నిక్ నూతన హాస్టల్, ప్యాలెస్ ఆధునీకరణ, చిట్యాల, పీర్లగుట్ట డబుల్ బెడ్రూం ఇండ్ల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జిల్లాకు నూతనంగా వచ్చిన ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిశారు. లక్ష్మీపల్లి గ్రామంలో హత్యకు గురైన శ్రీధర్‌రెడ్డి కేసును విచారించి హంతకులను గుర్తించాలని మాజీ మంత్రి కోరారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశామని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ జెడ్పీటీసీలు రఘుపతి రెడ్డి, సామ్యానాయక్, మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు లక్ష్మారెడ్డి, మాణిక్యం, రాజవర్ధన్ రెడ్డి, అశోక్, జమీల్, రాము, జగన్నాథంనాయుడు, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.



వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



తీలేరు పంప్‌హౌస్ నుంచి పరుగులు పెడుతున్న వరద

## కోయిల్‌సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

నమస్తే ఎఫెక్ట్

మరికల్, జూలై 30 : 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఈ నెల 29న ప్రచురించిన 'నాడు జలకళ.. నేడు వెలవెల' వార్తకు నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. తీలేరు స్టేజ్–2 నుంచి మంగళవారం కోయిల్‌సాగర్‌కు పంపింగ్‌ను ప్రారంభించారు. గతంలో జూరాలకు వరదలు వచ్చాయంటే పంప్‌హౌస్ నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేసేవారు. ప్రస్తుతం జూరాల గేట్లు ఎత్తినా కోయిల్‌సాగర్‌కు నీటిని ఒక్క రోజు విడుదల చేసి పంపులు బంద్ చేశారు. దీంతో ప్రాజెక్టుకు నీరు చేరుతుందా లేదా అని రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నీలవేణి గలగలలు

గద్వాల, జూలై 30 : ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాలకు భారీగా వరద వస్తున్నది. మంగళవారం జూరాలకు 2.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 39 గేట్లు ఎత్తి 2,62,179 క్యూసెక్కులను విడుదల చేశారు. జూరాల పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.434 టీఎంసీలుగా ఉన్నది. జూరాల నుంచి విద్యుదుత్పత్తికి 19,698, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750, భీమా లిఫ్ట్–1కు 650, భీమా లిఫ్ట్–2కు 750, జూరాల ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 658, కోయిల్‌సాగర్‌కు 315, సమాంతర కాల్వకు 900 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి 2,86,115 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

### టీబీ డ్యాంకు..


అయిజ, జూలై 30 : టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 52,028, అవుట్‌ఫ్లో 61,636 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వకుగానూ ప్రస్తుతం 101.734 టీఎంసీలు నీటి నిల్వ ఉన్నది. అలాగే ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 83,016, అవుట్‌ఫ్లో 82,453 క్యూసెక్కులుగా ఉన్నది. ఆయకట్టుకు 563 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రస్తుతం ఆనకట్టలో 12.3 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నది.

### ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు..

ఆల్మట్టి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 3 లక్షలు, అవుట్‌ఫ్లో 3.50 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 129.72 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 67.967 టీఎంసీలుగా ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 3.25 లక్షలు, అవుట్‌ఫ్లో 3.50 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. గరిష్ఠస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 23.769 టీఎంసీలు ఉన్నది.

### శ్రీశైలం పది గేట్లు ఎత్తివేత

శ్రీశైలం, జూలై 26 : శ్రీశైలం జలాశయానికి వరద అంతకంతకూ పెరుగుతున్నది. శ్రీశైలం డ్యాంలో రాత్రికి 4,13,178 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో పది గేట్లను ఎత్తి వరదను నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 209.5948 టీఎంసీలు నిల్వ ఉన్నది. కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 21,432, ఎడమగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు గేట్లు, విద్యుదుత్పత్తి కేంద్రాల నుంచి 3,32,447 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.



శ్రీశైలం డ్యాం పది గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద

### ఎగువ జూరాలలో విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 30 : ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లోని ఐదు యూనిట్లలోనే విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు రోజులుగా ఉత్పత్తి నిలిచిపోగా, ఎగువ జూరాలలో మాత్రం 5 యూనిట్లలో ఉత్పత్తి కొనసాగుతున్నది. సోమవారం అర్ధరాత్రి వరకు 2.072 మి.యూ ఉత్పత్తి జరుగగా మొత్తంగా 33.390 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి నిలిచిపోయిన పరిస్థితుల్లో ఇప్పటి వరకు 32.995 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పడితేనే దిగువ జూరాలలో ఉత్పత్తి సాధ్యపడుతుందని ఎస్ఈ కల్లూరి రామసుబ్బారెడ్డి తెలిపారు.